వ్యాధులపై అప్రమత్తత అవసరం



గణపవరంలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది


మానవహారం నిర్వహిస్తున్న సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, వైద్యాధికారిణి రోజా, వైద్య సిబ్బంది

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమలు, వ్యాధుల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గణపవరం పీహెచ్‌సీ వద్దనుంచి పోలీస్ ఐలాండ్ వరకూ మలేరియా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం విస్తారంగా ఉన్న జ్వరాలపై ఆందోళన చెందవద్దని, అప్రమత్తతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. దోమలనుంచి రక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తే చాలావరకూ దోమలు అరికట్టవచ్చునని సూచించారు. ఇంటింటికి తిరిగి అపరిశుభ్రత, మురుగునీటి నిల్వలు, దోమల వ్యాప్తి, దోమల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: కాగుపాడు, చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా నిర్మూలన దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కాగుపాడులో డీఎల్‌డీవో రమణ, చేబ్రోలులో తహసీల్దార్ వెంకటరమణ, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వర్మ, డా.జోషిరాయ్, ఏఎస్‌ఎంలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపన్నపాలెంలో...

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత సామూహిక పరిశుభ్రతను పాటిస్తూ వాటి ప్రాధాన్యతను ఇతరులకు తెలియజేయాలని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రోజా అన్నారు. మంగళవారం గోపన్నపాలెంలో ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవం సందర్భంగా ఫ్లెక్సీలు పట్టుకుని, వైద్యశాల నుంచి ట్యాంక్ సెంటర్, బస్టాండ్ సెంటర్, మసీదుపాడు క్రాస్, మసీదుపాడు, ఇతర వార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నాగరాజు, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, గ్రామ కార్యదర్శి యోహోషువా, ఏఎన్‌ఎంలు, ఆశా సిబ్బంది, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన

గణపవరం : ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు బుధవారం పర్యటన వివరాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రతినిధి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఉంగుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద వేదస్పైన్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచితవైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఉంగుటూరులో మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం అమలు తీరుపై పాత్రికేయులు, పార్టీ ప్రముఖులతో సమావేశమవుతారిన తెలిపారు. సాయంత్రం 4.30గంటలకు గణపవరం మండలం పిప్పర వడ్డిపేటలో 145వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ఉంగుటూరు: ఉంగుటూరులో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డా. పి.తేజో ఫణీంద్ర వెల్లడించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారన్నారు. శిబిరంలో వెన్నుముక, ఎముకల సమస్యలు, స్త్రీ సంబంధ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు జరిపి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని ఉంగుటూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ముగిసిన గంగానమ్మ తల్లి వార్షికోత్సవం


కలశాలతో చల్లచింతలపూడిలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

దెందులూరు: చల్లచింతలపూడిలోని గంగానమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ముగిశాయి. తొలుత ఆలయ ఉత్సవ నిర్వాహకులు, ఆలయ అర్చకులు అమ్మవారికి విశేషాలంకరణ చేసి జలాభిషేకం చేసి పూజలు నిర్వహించి ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులు కలశాలతో కన్నులపండుగగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

6వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

పెదపాడు: రబీ సీజనులో 2,230 ఎకరాల్లో 6,000మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూధనరావు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు ఆర్‌బీకేను సందర్శించారు. అనంతరం ఆయన ఆయన మాట్లాడుతూ పెదపాడు మండలంలోని కొక్కిరపాడు, వట్లూరు, కలపర్రు ముప్పర్రు ప్రాంతాల్లో ధాన్యం సేకరణ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికి వరకు 2,379 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. త్వరలోనే మిగిలిన ధాన్యం కొనుగోలు చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి నిధుల మంజూరుకు కృషి


ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసిన జిల్లాలోని వైఎస్సార్ సీపీ నేతలు, వెలమ సంఘ పెద్దలు

దెందులూరు: ఏలూరులో వెలమ కల్యాణ మండపానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ హామీ ఇచ్చారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, వెలమ సంఘ పెద్దలు మరడాని రంగారావు, కిలాడి దుర్గారావు, బొరపూడి శ్రీను, గొట్టాపు మోహనరావు, ఆర్నేపల్లి మధు కలిశారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని స్థలం కేటాయించారని, నిధులు మంజూరు చేస్తే త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ప్రసాద్ ఎంపీకి వివరించారు.

నేడు ఎంపీటీసీ ఛాంబర్ ఎన్నికలు

నిడమర్రు : నిడమర్రు మండల ఎంపీటీసీ ఛాంబర్ ఎన్నికలు బుధవారం నిడమర్రు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఛాంబర్ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ బాధ్యులు పుప్పాల కన్నబాబు, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి, మండల సచివాలయ కన్వీనర్, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులంతా విధిగా హాజరుకావాలని వారు కోరారు.

కొవ్వలి సర్పంచ్, కార్యదర్శికి సత్కారం


కొవ్వలి సర్పంచ్ ఇంటేటి మధులత, కార్యదర్శి రంగనాయికమ్మను సత్కరిస్తున్న ఎంపీపీ సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం

దెందులూరు: సమష్టి కృషి, ప్రణాళిక, సమన్వయంతోనే సత్ఫలితాలు లభిస్తాయని దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు మంగళవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన కొవ్వలి సర్పంచ్ ఇంటేటి మధులతా గంగాధర్, కార్యదర్శి రంగనాయకమ్మను శాలువా, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాల్లో గ్రామాల్లో సాధించిన పనులను ఉత్తమ పురస్కారం అందజేసినట్టు తెలిపారు. వైస్ ఎంపీపీలు వేమూరి జితేంద్ర, గొల్ల నాగరాజు, సర్పంచ్, కార్యదర్శులను సత్కరించారు.

సచివాలయం తనిఖీ

ఉంగుటూరు: ఉంగుటూరు-1 సచివాలయాన్ని డీఎల్‌డీవో వెంకటరమణ మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయంలో పని చేస్తున్న ఉద్యోగుల పనితీరును ఆయన పరిశీలించారు. అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్, సిబ్బంది రికార్డులను, ఎస్‌డీజీ సర్వే, ఏఎన్‌ఎం కార్యక్రమాలు, హౌసింగ్, మహిళా పోలీస్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యదర్శి గిరిధర్ ఆయనకు సహకరించారు.

సీఎం సహాయనిధి నుంచి రూ.70 వేలు అందజేత


ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితుడికి అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు

పెదవేగి : కార్యకర్తకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన దెందులూరు బహిరంగ సభ కార్యక్రమంలో పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మరీదు నాగరాజు గాయపడి ఆసుపత్రిలో చేరగా, అదే రోజు అతడిని పరామర్శించి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. అనంతరం, నాగరాజు పూర్తిగా కోలుకోవడానికి మరింత సహాయం అవసరం అని తెలుసుకొని, అదనపు వైద్య ఖర్చుల కోసం మరో రూ.70,000 ఎమ్మెల్యే మంగళవారం స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. నాగరాజు కోలుకోవడానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఔదార్యాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, దెందులూరు తహసీల్దార్ నాంచారయ్య, వైఎస్సార్ సీపీ నేత చళ్ళగొళ్ల తేజ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా స్పీడు బ్రేకర్ల నిర్మాణం


కొవ్వలిలో ఎత్తుగా, వెడల్పుగా వేసిన స్పీడ్ బ్రేకర్

దెందులూరు: పంచాయతీరాజ్ చట్టానికి తూట్లు పొడుస్తూ నిబంధనలకు నీళ్లొదిలి ప్రధాన రహదారులు, వీధుల్లో విచ్చలవిడిగా స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తున్నారు. దెందులూరు మండలంలో గ్రామాల్లో వీధి వీధిన స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా, వెడల్పుగా ఇంటికొకటి చొప్పున నిర్మిస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఎక్కడికక్కడ నిర్మించడంతో వాహనదారులు, సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, ఉద్యోగులు సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎక్కడైనా స్పీడ్ బ్రేకర్లు వేయడం పంచాయతీ రాజ్ చట్టానికి విరుద్ధమన్నారు. స్పీడ్ బ్రేకర్ అవసరమైతే గ్రామ పంచాయతీ లిఖితపూర్వక వినతి, తీర్మానం అవసరమని అన్నారు.స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా, వెడల్పుగా వేసి చిన్నారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న స్పీడ్ బ్రేకర్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలి


బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదవేగి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని సాధన దిశగా కృషి చేయాలని ఆంధ్ర రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జే రాజేంద్ర చెప్పారు. పెదవేగి మండలం ఎంఆర్‌సీ కాలనీలోని జవహర్ నవోదయ విద్యాలయాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జే రాజేంద్ర, ఎంపీడీఓ, ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. విద్యాలయానికి విచ్చేసిన కమిషన్ సభ్యులను అధ్యాపక సిబ్బంది ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నవోదయ ప్రిన్సిపాల్‌తో రాజేంద్ర సమావేశమై విద్యార్థులకు అందిస్తున్న వసతులు, విద్యాకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులతో మమేకమై పలు అంశాలు వివరించారు.ఎంపీడీఓ రాజ్‌మనోజ్ మాట్లాడుతూ ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు, సిబ్బందికి, విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. వై చంద్రశేఖర్, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, మహిళా సంరక్షణా కార్యదర్శులు ఎం జ్యోతి, వై ప్రశాంతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి



మహాసభలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రోజా

ఏలూరు (టూటౌన్): పెరుగుతోన్న నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.రోజా కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ ఏలూరు జిల్లా 8వ మహాసభ మంగళవారం ఎండీ హసీనా బేగం, పి.సుజాత, రాజేశ్వరిల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో రోజా మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు తక్షణమే పెంచాలని, వారిపై పర్యవేక్షణ పేరుతో వేధింపులకు పాల్పడటం అన్యాయమని అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మెనూ చార్జీలను సరిపడా ఇవ్వకుండా వారిపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం ప్రయత్నిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు రోజు రోజుకు తగ్గిస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు బిల్లు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు గ్రాట్యూటీ ఇవ్వాలని, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలన్నారు. మహాసభలో కె.విజయలక్ష్మి, పి.హైమావతి, పీఎల్ఎస్ కుమారి, బీజెఎన్ కుమారి, విమల, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గరుడ వాహనోత్సవం


గరుడ వాహనంపై వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 34వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి గరుడ వాహనోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. భగవద్రామానుజ తిరు నక్షత్రం సందర్భంగా విశేష పంచామృత అభిషేకం, శాత్తుమొరై నిర్వహించారు. సకల శత్రు నివారనార్థం సుదర్శన నారసింహేష్టి (హోమం), మంగళాశాసనాలు, తీర్థ ప్రసాద వితరణగావించారు. సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన, చతుఃస్థానార్చన, మూలమంత్ర హవనాలు, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి 7 నుంచి స్వామి వారి గరుడ వాహనోత్సవం నిర్వహించి మంగళాశాసనాలు పలికి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్టుబోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చెరువు సరిహద్దు సమస్య పరిష్కరిస్తాం


భోగాపురంలో ప్రజాప్రతినిధులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పెదవేగి : భోగాపురం-వట్లూరు చెరువు సరిహద్దు సమస్యను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని కలెక్టర్ వై ప్రసన్నవెంకటేష్ అన్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం భోగాపురంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న భోగాపురం - వట్లూరు చెరువు సరిహద్దు సమస్యను భోగాపురం సర్పంచ్ గతంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బాయ చౌదరి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ భోగాపురం విచ్చేసిన సందర్భంగా ఈ సరిహద్దు సమస్యను భోగాపురం సర్పంచ్, గ్రామ ప్రజలు ఆయనకు వివరించారు. కలెక్టర్ స్పందించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు, అధికారులు ఉన్నారు.

మేడేను విజయవంతం చేద్దాం


మేడే పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని ఏపీ ఆటో అం డ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి పిలుపునిచ్చారు. స్థానిక పాత బస్టాండ్ పరిధిలోని ప్రగతి ఆటో స్టాండ్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మేడే విశిష్టతను వివరించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 లేబర్ చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని కార్మిక వర్గం అంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రవాణారంగంపై ఏటా రూ.3 లక్షల కోట్లు ఆదాయాన్ని సంపాదించి పెడుతున్నారని, కనీసం రూ.20 వేల కోట్లు రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఎం.ఇస్సాక్, ఆటో యూనియన్ అధ్యక్షుడు నల్ల పాపినీడు, బొల్లా నాని, ఉరమల సురేష్, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జగద్గురువుల సందేశాలు శిరోధార్యం


భీమడోలులో ఆదిశంకరాచార్యునికి పూజలు చేస్తున్న దృశ్యం

భీమడోలు : హిందూధర్మోద్ధరణ కోసం జగద్గురువు ఆదిశంకరాచార్యులు చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలులోని శ్రీగాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య భవనంలో మంగళవారం ఆదిశంకరాచార్యులు, రామానుజుల వార్ల జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీబొట్ల కృష్ణప్రసాద్ విశేష పూజలు జరిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను అఖండ భారతావనికి చాటిన ఆది శంకరాచార్యులు, రామానుజులు కృషి శ్లాఘనీయమన్నారు. ఆదిశంకరాచార్యులు మానవాళికి అందించిన సందేశాలు నేటికి శిరోధార్యమన్నారు. జిల్లా కార్యదర్శి కాశీబొట్ల పార్వతీశ్వర శర్మ, పెద్దలు భోగరాజు జోగేశ్వరరావు, రొంపిచర్ల వెంకటాచార్యులు, లంకా రామకృష్ణ, కంచి ప్రకాశరావు, పంద్రంగి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: కైకరం పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆదిశంకరాచార్యుల జయంతిని అర్చకుడు లంక రాంబాబు బ్రహ్మత్వంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గీతామృత తత్సంగం సీతారామ గీతార్చన భజన మండలి సంయక్త ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. సత్సంగం వ్యవస్థాపకుడు కొచ్చర్ల కోట శ్రీనివాసు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జగనన్నే మా భవిష్యత్తు


కొవ్వలిలో సర్వే నిర్వహిస్తున్న దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్

దెందులూరు: గడిచిన నాలుగేళ్లల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలందరి భవిష్యత్తు కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమకు పూర్తి నమ్మకాన్ని కల్పించాయని, ఈ పథకాలు కొనసాగితేనే తమ భవిష్యత్తు మారుతుందని ప్రజలు భావిస్తున్నారని దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్ అన్నారు. మంగళవారం కొవ్వలిలో సర్పంచ్ ఇంటేటి మధులత, దెందులూరు వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఎంపీటీసీ గోరిపర్తి వరలక్ష్మి రంగారావు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, జిల్లా కార్యదర్శి గొల్లా వీరాస్వామి గృహసారథులు, వలంటీర్లతో కలిసి జగనన్నే మా భవిష్యత్తుపై సర్వే నిర్వహించారు. కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, పార్టీ నాయకులున్నారు.

వేసవిలోనూ నీటి చౌర్యం



భీమడోలు వద్ద గోదావరి కాల్వ నీటితో భారీ వాహనానికి వాటర్ సర్వీసింగ్ చేస్తున్న దృశ్యం

భీమడోలు : గోదావరి కాల్వ వెంబడి నీటి చౌర్యం జోరుగా సాగుతోంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న గుండుగొలను నుంచి పూళ్ల వరకు కాల్వ గట్టును అక్రమించుకున్న వాటర్ సర్వీస్ కేంద్రాల నిర్వాహకులు ప్రస్తుత వేసవిలోనూ యథేచ్ఛగా నీటిని చౌర్యం చేస్తూ వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో డెల్టాలోని ఆయకట్టులోని పొలాలకు సాగునీటితోపాటు కాల్వ వెంబడి గల 15 గ్రామ పంచాయతీల్లోని మంచినీటి చెర్వులను ఈ నీటితోనే నింపుకోవాల్సి ఉంది. నీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఇరిగేషన్ అధికారులు వాటిని మూయించకపోవడంతో వేసవిలోను నీటి వ్యాపారం సాగిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చేనేత ఐక్యవేదిక కరపత్రం విడుదల

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంఘం కరపత్రాన్ని స్థానిక పత్తేబాదలోని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిచ్చుక సోమరాజు ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యక్రమాలు, కరపత్రంలోని అంశాలను సోమరాజు యూనియన్ నాయకులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నార్ని అనిల్ కుమార్, ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షులు కొలసనం మధుబాబు, జిల్లా అధ్యక్షుడు వానపల్లి లక్ష్మి, ఏలూరు నగర అధ్యక్షుడు చింతా సుబ్బారావు, మాడా మల్లికార్జునరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

వేలేరుపాడు : అర్హులైన నిర్వాసితులందరికీ పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందనున్నట్లు వేలేరుపాడు తహసీల్దార్ కె.చల్లన్నదొర పేర్కొన్నారు. మంగళవారం వేలేరుపాడు మండలంలో మారుమూలనున్న టేకూరు గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఉన్న మొత్తం 178 మంది లబ్ధిదారుల పేర్లు చదివి విన్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరైన 20 మంది నిర్వాసితులు చనిపోయారన్నారు. చనిపోయిన కుటుంబ సభ్యుల్లో అర్హులు ఉంటే వారికి ప్యాకేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ మంజూరుకాని అర్హులైన నిర్వాసితులుంటే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. టేకూరు గ్రామ నిర్వాసితులు జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం శివారుగ్రామమైన పాకలగూడెంలో పునరావాసం కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, కట్కూరు సర్పంచ్ లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వర్లు, వీఆర్వో, వీఆర్‌ఏ పాల్గొన్నారు.